క్లుప్తంగా

వెంకన్న కల్యాణ మండపం ప్రారంభోత్సవం



శిఖర ప్రతిష్ఠలో పాల్గొన్న మంత్రి విశ్వరూప్ దంపతులు

అమలాపురం టౌన్: అమలాపురం వేంకటేశ్వర స్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన స్వామి వారి కల్యాణ మండపం ప్రారంభోత్సవం, శిఖర ప్రతిష్ఠా మహోత్సవం గురువారం వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, బేబీ మీనాక్షి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వాడపల్లి, అప్పనపల్లి ఆలయాల తరహాలో ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నందుకు ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవిని అభినందించారు. అనంతరం ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి విశ్వరూప్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ పట్టణ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి తదితరులు పాల్గొన్నారు.

నేడు సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠా మహోత్సవాల్లో పాల్గొన్న టీటీడీ పాలక మండలి సభ్యుడు మల్లాడి కృష్ణారావు

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం కర్రివానిరేవు పంచాయతీ శివారు చింతావానిరేవులో సుమారు రూ.50 లక్షలతో పునర్నిర్మించిన శ్రీహనుమత్ సీతాలక్ష్మణ సమేత సీతారామస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నారు. ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా గత రెండు రోజులుగా బ్రహ్మశ్రీ సుదర్శనం వెంకట జనార్దనాచార్యులు మంత్రోచ్చరణల మధ్య వేద పండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. గురువారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో స్వామివారి గ్రామోత్సవం జరిపారు. పుదుచ్చేరి రాష్ట్ర ఢిల్లీ ప్రత్యేక అధికారి, టీటీడీ పాలక మండలి సభ్యులు మల్లాడి కృష్ణారావు, చింతా నాగమునీంద్రరావు, రేకాడి రాంబాబు గ్రామోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయ పునర్నిర్మాణ శంకుస్థాపన

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి గ్రామంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం పునర్నిర్మాణంలో భాగంగా గురువారం శంకుస్థాపన చేశారు. గతంలో నిర్మించిన ఆలయం 51 సంవత్సరాలు పూర్తయిన కారణంగా ఆ ఆలయాన్ని తొలగించి అదే ప్రాంతంలో భక్తుల సహకారంతో నూతన ఆలయాన్ని నిర్మిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కడి సూరిబాబు, సలాది ముత్యాలరావు, పుత్సల ఏసు, బళ్ల గిరిబాబు, మేడిద సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మిత్ర పురుగులను కాపాడుకుందాం

మలికిపురం: దాళ్వా సాగులో మిత్రపురుగుల పరిరక్షణ ప్రధాన కర్తవ్యమని మండల వ్యవసాయాధికారి(ఏవో) ఎస్.రాకేష్ పేర్కొన్నారు. విశ్వేశ్వరాయపురంలో గురువారం జరిగిన వైఎస్సార్ పొలంబడిలో రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఇష్టానుసారం ఎరువులు, పురుగుమందుల వినియోగం వల్ల మిత్ర పురుగులు చనిపోయే అవకాశం ఉందన్నారు. వాటి పరిరక్షణపై శిక్షణ ఇచ్చారు. అలాగే తెగుళ్ల నివారణకు ప్రకృతి వ్యవసాయ విధానంలో నివారణ మార్గాలను అనుసరించాలని వివరించారు. తద్వారా మెరుగైన దిగుబడులతో పాటు నాణ్యమైన, ఆరోగ్యకరమైన పంట దిగుబడి సాధించవచ్చని పేర్కొన్నారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్, థెరిస్సా, శ్రీరామ్ పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.4.77 లక్షలు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసియున్న నూకాంబికా అమ్మవారికి హుండీ ద్వారా రూ.4.77 లక్షల ఆదాయం లభించింది. అమ్మవారి ముఖ మంటపంలో రామచంద్రపురం దేవదాయశాఖ తనిఖీ ఇన్‌స్పెక్టర్ బాలాజీ రామ్‌ప్రసాద్ పర్యవేక్షణలో చైర్మన్ నూకపెయ్యి శ్రీనివాసు, ఈఓ ఉండవల్లి వీర్రాజు సమక్షంలో గురువారం అధికారులు, అనపర్తికి చెందిన శ్రీమాణిక్యాంబ భీమేశ్వర స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులు ఆలయంలోని ఎనిమిది హుండీలను లెక్కించారు. 2022 మే 23 నుంచి 2023 మార్చి 8 వరకూ ఈ ఆదాయం లభించింది.



పార్కులో మూలకు చేరిన పరికరం



కురసాంపేట పార్కులో ఒరిగిపోయిన బెంచీ



యానాం చిల్డ్రన్స్ పార్కులో పాడైపోయిన హట్

ఉన్నాయంటే.. ఉన్నాయంతే...

- ఆహ్లాదపరిచే పార్కులపై అలసత్వం
- రూ.కోట్ల ఖర్చుతో నిర్మాణం.. నిర్వహణ శూన్యం
- పట్టించుకోని మున్సిపల్ యంత్రాంగం

యానాం: పర్యాటకులకు ఆహ్లాదం పంచేందుకు నిర్మించిన పార్కులవి.. చిన్నారులు ఆడుకునే జారుబల్లలున్నాయి. కాని విరిగిపోయి నిరుపయోగంగా మారిపోయాయి. అందరూ కూర్చునే బెంచీలు ఏర్పాటుచేశారు. కాకపోతే వాటి చుట్టూ ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. అందమైన విద్యుత్ దీపాలు పెట్టించారు. అవి తుప్పుపట్టిపోయాయి. కోట్లాది రూపాయల ఖర్చుతో నిర్మించిన పార్కులు నిర్వహణ లేక చిట్టడవుల్లా దర్శనమిస్తున్నాయి. ఇదీ యానాంలో పార్కుల పరిస్థితి..

యానాం పట్టణ పరిధిలో చిల్డ్రన్స్ పార్క్, అంబేడ్కర్ నగర్ పార్క్, కురసాంపేట పార్క్, పరంపేట పార్క్ తదితర పది పార్కులున్నాయి. యానాం వచ్చే పర్యాటకులను దృష్టిలో ఉంచుకుని దాదాపు ఏడేళ్ల క్రితం ఒక్కో పార్కు ఏర్పాటు, సుందరీకరణ కోసం రూ.2 కోట్ల నుంచి రూ.2.50 కోట్లు ఖర్చు చేశారు. అయితే కాలక్రమంలో వాటిని పర్యవేక్షించాల్సిన మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో అవన్నీ ముళ్లపొదలు, పిచ్చి మొక్కలతో చిట్టడవుల్ని తలపిస్తున్నాయి. పార్కులో ప్రశాంతంగా కాసేపు గడుపుదామని వస్తున్న సందర్శకులకు ఏ పొదల్లో నుంచి ఏ పాము వస్తుందోననే ఆందోళన వ్యక్తమవుతుంది. ఈ కారణంగానే యానాంలో ఉన్న పార్కులకు ప్రజాదరణ తగ్గిపోయింది. కురసాంపేట పార్కు, అంబేడ్కర్‌నగర్ పార్కులైతే పూర్తిగా మూలకు చేరిపోయాయి.



అంబేడ్కర్‌నగర్ పార్క్ దుస్థితి

చిన్నారులకేది ఆటవిడుపు..?

పట్టణ నడిబొడ్డున చిన్నారుల కోసం కోట్లాది రూపాయిల ఖర్చుతో నిర్మించిన చిల్డ్రన్స్ పార్క్ పరిస్థితి దయనీయంగా మారిపోయింది. సాయంత్రమైతే వందలాది మంది చిన్నారులు ఈ పార్క్‌లో ఆడుకుంటుంటారు. అయితే ఇక్కడ ఏర్పాటుచేసిన ఒంటెబొమ్మ జారుడుబల్ల, చిన్నారుల హట్ లాంటివి పాడైపోయి నెలలు గడుస్తున్నా వాటి మరమ్మతుల ఊసేలేదు. అలాగే ఇక్కడ ఏర్పాటుచేసిన పిల్లలు ఊగే వస్తువుల్లాంటివి తుప్పు పట్టి ప్రమాదకరంగా మారిపోయాయి. నాలుగేళ్ల క్రితం ఎకరం స్థలంలో నిర్మించిన అంబేడ్కర్‌నగర్ పార్కులోకైతే సందర్శకులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా పార్క్‌లో చిన్నారులు ఆడుకునేందుకు వేసిన జారుడు బల్ల, కూర్చోవడానికి నిర్మించిన సిమెంట్ బెంచీలు, సిమెంట్ గోపురాల చుట్టూ ముళ్లపొదలు అల్లుకుపోయాయి. కురుసాంపేట పార్క్‌లో నిర్మించిన అందమైన ఆకృతులన్నీ అవసాన దశకు చేరుకున్నాయి. పార్కులో వేసిన విద్యుత్ లైట్లు తుప్పు పట్టి ప్రమాదకరంగా మారాయి.

నిర్వహణకు సిబ్బంది అవసరం

మున్సిపల్ పార్కులు నిర్వహించాలంటే తగిన సిబ్బంది అవసరం. కాని మున్సిపాలిటీలో సిబ్బంది తక్కువగా ఉండటంతో వాటి నిర్వహణపై దృష్టి సారించలేకపోతున్నాం.

– కె.రామకృష్ణ, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్, యానాం

అందుబాటులోకి తీసుకురావాలి

కోట్లాది రూపాయల ప్రజాధనంతో పార్కులను నిర్మించి నిర్వహణ లేకుండా గాలికొదిలేశారు. అవి పాడైపోయి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్నాయి. కనీసం తుప్పలను తొలగించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

– సబ్బతి శ్రీనివాసరావు, యానాం

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

ముమ్మిడివరం: మహిళలు అన్ని రంగాల్లో స్వతంత్ర జీవనం సాగించేలా ఆర్థిక స్వావలంబన సాధించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాశి సిద్ధార్థకుమార్ అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ శివారు పల్లిపాలెంలో మండల లీగల్ సెల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం మహిళలకు చట్టాల ద్వారా కల్పించిన హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ యర్ల రాంబాబు, లీగల్ కమిటీ సభ్యుడు దాసరి సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను నివారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో గౌరీకుమారి

ఉప్పలగుప్తం: వేసవిలో ఏటా తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న ప్రాంతాలను గుర్తించి అవసరమైతే అక్కడకు ట్రాక్టర్ ద్వారా నీటిని సరఫరా చేయాలని ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కార్యదర్శులు, ఏఈలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గౌరీకుమారి మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామాలకు తాగునీరందిస్తున్న రక్షిత మంచినీటి చెరువుల ప్రాజెక్టలను పూర్తి స్థాయిలో నింపి సిద్ధం చేయాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు.

సామాజిక ప్రగతి సూచీలో ప్రథమ ర్యాంకు



అసెంబ్లీలో ప్రసంగిస్తున్న ఎల్జీ తమిళిసై సౌందరరాజన్

యానాం: సామాజిక ప్రగతి సూచీలో పుదుచ్చేరి దేశంలోనే ప్రథమ ర్యాంకు సాధించిందని ఎల్జీ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. గురువారం బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆమె సభ్యులనుద్దేశించి ప్రసంగించారు. పుదుచ్చేరిలోని నాలుగు రీజియన్లోను తాగునీరు, పారిశుద్ధ్యం, గృహ వసతి, వ్యక్తిగత రక్షణ, స్వేచ్ఛ తదితర సదుపాయాల గురించి ఇనిస్టిట్యూట్ ఫర్ కాంపిటిటివ్‌నెస్(ఐఎఫ్‌సీ) నివేదికలో ప్రశంసించడం గర్వంగా ఉందన్నారు. గత ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో 11,500 కోట్లు కేటాయించగా అదనంగా కేంద్రం రూ.1400 కోట్లు సహాయం చేసిందన్నారు. యానాం, కారైకల్, మాహే, పుదుచ్చేరికి సీవరేజ్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు కోసం రూ.150 కోట్ల బడ్జెట్‌కు ఆమోదించినట్లు చెప్పారు. కనకాలపేటలో ఇండోర్ స్టేడియం కోసం రూ.3.65 కోట్లు, గిరియాంపేటలో డ్రెయిన్‌ల పటిష్టతకు రూ.44.25 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో సీఎం రంగసామి, స్పీకర్ ఆర్ సెల్వం, మంత్రులు, యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాల కల్పనకు నిధుల మంజూరు



నిధుల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే అశోక్‌కు అందజేస్తున్న నామినేటెడ్ ఎమ్మెల్యే అశోక్‌బాబు

యానాం: యానాం నియోజకవర్గంలో మౌలిక సౌకర్యాల కల్పనకు రూ.24.17 లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్లు పుదుచ్చేరి నామినేటెడ్ ఎమ్మెల్యే ఆర్‌బీ అశోక్‌బాబు తెలిపారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌కు నిధుల మంజూరుకు సంబంధించిన పత్రాలను అందజేశారు. నామినేటెడ్ ఎమ్మెల్యే ల్యాడ్ నిధులతో కురసాంపేట హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి, యానాంలో క్రిస్టియన్ శ్మశానవాటికలో మౌలిక సౌకర్యాల కల్పనకు వినియోగిస్తారని తెలిపారు. యానాంకు నిధులు మంజూరు చేసినందుకు అశోక్‌బాబుకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: మండలంలోని సమనసలో ఉన్న మహాత్మా జ్యోతిరావుపూలే బాలుర గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తుల్ని ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైటీఎస్ రాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 9 నుంచి 11 ఏళ్ల మధ్య వయసు విద్యార్థులు అర్హులన్నారు. ఏప్రిల్ 4వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. మరిన్ని వివరాలకు పాఠశాలలోని కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పింఛన్‌దారుల సమస్యలు పరిష్కరించాలి

మామిడికుదురు: అపరిష్కృతంగా ఉన్న పింఛన్‌దారుల సమస్యలను తక్షణమే పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోనసీమ జిల్లా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. మామిడికుదురులో తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేట్ అధ్యక్షుడు జీవీ సత్యనారాయణ, అధ్యక్షుడు ఎం.అప్పారావు, కార్యదర్శి జి.హనుమంతరావు, ట్రెజరర్ జి.నరసింహారావులు మాట్లాడుతూ పింఛనర్లకు బకాయి ఉన్న డీఆర్, ఏరియర్స్ సత్వరం చెల్లించాలన్నారు.

మానసిక ప్రశాంతతకు నిలయం ఓం శాంతి కేంద్రం

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్

అమలాపురం టౌన్: మానసిక ప్రశాంతతకు నిలయంగా ఉన్న అమలాపురం ఓం శాంతి కేంద్రం పట్టణానికే తలమానికంగా నిలుస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. స్థానిక రవణంవీధిలో గరిగుంట చెరువు వద్ద ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ సంస్థ నూతనంగా నిర్మించిన ఓ శాంతి కేంద్ర భవనాన్ని మంత్రి విశ్వరూప్ కుటుంబ సమేతంగా గురువారం సందర్శించారు. కేంద్రం ఇన్‌చార్జి బీకే శ్రీదేవి, బ్రహ్మకుమారీలు మంత్రి కుటుంబీకులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ఈ ఓం శాంతి కేంద్రానికి తన సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వపరంగా నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి విశ్వరూప్, బేబీ మీనాక్షి దంపతులను ఓ శాంతి కేంద్రం తరపున సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి విశ్వరూప్ దంపతులను సత్కరిస్తున్న ఓం శాంతి కేంద్రం ఇన్‌చార్జి శ్రీదేవి

ఆశీలు చెల్లించలేం

- లారీ ఓనర్స్ అసోసియేషనే చెల్లించాలి
- మున్సిపల్ కమిషనర్‌కు చాంబర్ ఆఫ్ కామర్స్ వినతి

అమలాపురం టౌన్: మున్సిపాలిటీలో చాలా కాలంగా ఆశీలు చెల్లింపు విషయంలో వ్యాపారులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ మధ్య వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడును అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధుల బృందం గురువారం కలిసి సమస్యపై చర్చించారు. తాము చేసే వ్యాపారాలకు అన్ని పన్నులు ప్రభుత్వానికి చెల్లిస్తున్నామని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్తిబాబు కమిషనర్‌కు వివరించారు. ఇప్పటివరకూ లారీ అసోసియేషన్ ప్రతినిధులే ఆశీలు చెల్లిస్తున్నారని, ఇప్పుడు కొత్తగా ఆశీలు చెల్లించమంటున్నారని కమిషనర్‌కు తెలిపారు. ఈ వివాదం తేలే వరకూ లారీ అసోసియేషనే ఆశీలు చెల్లించాలని వారు వినతి పత్రంలో డిమాండ్ చేశారు. దీనిపై మున్సిపల్ అధికారులు తగు నిర్ణయం తీసుకుని తమకు న్యాయం చేయాల్సిందిగా కోరారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు దొమ్మేటి సాయిబాబు, చింతలపూడి సత్తిబాబు, వలవల శివరావు, రేకపల్లి సూరిబాబు, ఆశెట్టి ఆదిబాబు తదితరులు కమిషనర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.



మున్సిపల్ కమిషనర్ నాయుడికి వినతి పత్రం అందిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

అక్రమ లైసెన్స్‌లు ఇచ్చినవారిపై చర్యలు తీసుకోవాలి

తాళ్లరేవు: పచ్చని పంటచేలను చెరువులుగా మార్చేందుకు అక్రమంగా లైసెన్స్‌లు మంజూరు చేసిన అధికారులపై చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కోరంగి పంచాయతీ సీతారామపురంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో స్థానిక రైతు సత్యనారాయణ మాట్లాడుతూ పాతకోరంగి గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా చేపల చెరువుల తవ్వకాలకు అనుమతులు లభించేలా మండల స్థాయి అధికారులు తప్పుడు నివేదికలు సృష్టించారని ఆరోపించారు. అక్రమ లైసెన్స్‌లపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కూలీ సంఘం నాయకుడు టేకుమూడి ఈశ్వరరావు, వల్లు రాజబాబు, దుప్పి అదృష్టదీపుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సత్యనారాయణ తదితరులు

వైభవంగా గణపతి కల్యాణం

అంబాజీపేట: మాచవరం గ్రామ పంచాయతీ సమీపాన వేంచేసిన సిద్ధి, బుద్ధి సమేత యువగణపతి స్వామి వారి కల్యాణాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ కొడమంచిలి వెంకట కృష్ణ నాగేశ్వరరావుశర్మ పర్యవేక్షణలో బ్రహ్మశ్రీ కొంపెల్ల రఘునాథశాస్త్రి బ్రహ్మత్వంలో తాళం రామకృష్ణ, గోపిలక్ష్మి దంపతులతో స్వామి వారి దివ్య కల్యాణాన్ని జరిపారు. దొమ్మేటి త్రిమూర్తులు, సూర్యకుమారి దంపతులు, చిరంజీవి, శివ వినోద్‌కుమార్‌ల సహకారంతో భారీ అన్నసమారాధన చేశారు. 10, 12 వరకు స్వామి వారి వసంత పూజలు, 13న త్రిశూల స్నానం, 14న స్వామి వారికి పుష్పోత్సవం జరపనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



మాచవరంలో గణపతికి పూజలు చేస్తున్న అర్చకులు

కిమ్స్ విద్యార్థులకు యూనివర్సిటీ ర్యాంకులు

అమలాపురం రూరల్: విజయవాడ వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ నిర్వహించిన ఎంబీబీఎస్ ఫైనల్ పరీక్షల్లో అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల విద్యార్థులు ద్వితీయ, తృతీయ ర్యాంకులతో ప్రతిభను చాటారు. ఎంబీబీఎస్ విద్యార్థులు షేక్ సమ్రీన్ అంజుమ్ యూనివర్సిటీ రెండో ర్యాంకు, షేక్ సమియా మూడో ర్యాంకు సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు, కిమ్స్ ఎండీ రవికిరణ్ వర్మలు సత్కరించారు. కార్యక్రమంలో కిమ్స్ కళాశాల డీన్ డాక్టర్ ఆనంద్ ఆచార్య, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ హరి కిరణ్ వర్మ, జనరల్ మేనేజర్ రమేష్‌లు విద్యార్థులను అభినందించారు.



ర్యాంకు సాధించిన విద్యార్థిని సత్కరిస్తున్న కిమ్స్ ఎండీ రవికిరణ్ వర్మ, డీన్ ఆనంద్ ఆచార్య

సమాజాభివృద్ధిలో స్త్రీ పాత్ర ఉన్నతం

మామిడికుదురు: సమాజం అభివృద్ధిలో స్త్రీ పాత్ర ఎంతో ముఖ్యమైందని సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాశర్లపూడిలో ఏఎన్ఎం జుత్తుగ కస్తూరిని గురువారం ఘనంగా సత్కరించారు. కరోనా సమయంలో ప్రాణాపాయ స్థితికి వెళ్లి కోలుకుని కస్తూరి గ్రామస్తులకు విశేషమైన సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు. అప్పనపల్లి జెడ్పీ హైస్కూల్‌లో జయం కోనసీమ సేవా మండలి, కోనసీమ ఎన్జీవోల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు హెచ్‌ఎం సాయిబాబు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఎంపీటీసీ బొంతు నీలిమ పాల్గొని ప్రసంగించారు. స్వీపర్ కన్నమ్మను ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సేవా మండల టీం సభ్యులు బి.చందు, గడ్డం సురేంద్ర, బి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుపై శిక్షణ తరగతులు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉద్యాన శాఖ కార్యనిర్వాహక సంచాలకులు నేతల మల్లికార్జునరావు

అమలాపురం రూరల్: స్థానిక రైతు శిక్షణ కార్యాలయంలో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమలకు సంబంధించి శిక్షణ తరగతులను గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉద్యాన శాఖ కార్యనిర్వాహక సంచాలకులు నేతల మల్లికార్జునరావు మాట్లాడుతూ వ్యాపార వ్యవహారాలతో పాటు నాణ్యత, మార్కెటింగ్, ప్యాకింగ్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ట్రైనర్ అమర్ కిరణ్ ఆహార పరిశ్రమల్లో ప్యాకింగ్ చేసే పద్ధతులు, మార్కెటింగ్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎండుకొబ్బరి స్వీట్స్, బేకరీ, పచ్చళ్ళు, పప్పు దినుసులు, పూతరేకులు వంటి మొత్తం 22 రకాల ఆహార ఉత్పత్తులపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి ఎం.దిలీప్ కుమార్, డి.వెంకటేశ్వరరావు, కె.స్వామి తదితరులు పాల్గొన్నారు.

75 ఏళ్ల చరిత్రలో మాదిగలకు ఎమ్మెల్సీ పదవి

- సీఎం జగన్‌కు కృతజ్ఞతలు
- జిల్లా మాదిగ ముఖ్య నాయకుల సమావేశం హర్షం

అమలాపురం టౌన్: దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన గత 75 ఏళ్ల చరిత్రలో జిల్లాలోని మాదిగలకు ఓ ఎమ్మెల్సీ పదవి ఇచ్చి తమ సామాజిక వర్గానికి ముఖ్యమంత్రి జగన్ ఓ సముచిత స్థానం ఇచ్చారని జిల్లా మాదిగ ముఖ్య నాయకుల సమావేశం పేర్కొంది. అమలాపురం సంజీవనగర్ కస్తూరి గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు గంపల సత్యప్రసాద్ అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశం ఈ మేరకు హర్షం వ్యక్తం చేసింది. అమలాపురం నియోజకవర్గం నుంచి మాదిగ నేత బొమ్మి ఇజ్రాయిల్‌కు ఎమ్మెల్యేల కోటా నుంచి ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం మాదిగలకు ఓ శుభ పరిణామమని సమావేశం పేర్కొంది. ముఖ్యమంత్రి జగన్‌కు సమావేశం హర్షధ్వానాల మధ్య కృతజ్ఞతలు తెలిపింది. ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన బొమ్మి ఇజ్రాయిల్‌కు సమావేశం అభినందనలు తెలిపింది. సమావేశం జిల్లా మాదిగ రాజకీయ జేఏసీని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. జిల్లా జేఏసీ చైర్మన్‌గా ఆకుమర్తి ఆశీర్వాదం, గౌరవాధ్యక్షుడిగా మెకాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా చుట్టుగుళ్ల నీలకంఠం, వైస్ చైర్మన్‌గా గంపల సత్యప్రసాద్, ముఖ్య సలహాదారులుగా కొల్లి సూర్యారావు, దూరి రాజేష్, వీధి నాగ భూషణం, అయినవిల్లి రామారావు, సహాయ కార్యదర్శులుగా సవరపు అబ్రహం, చెయ్యేటి శ్రీనుతో పాటు 11 మంది కార్యవర్గ సభ్యులను సమావేశం ఎన్నుకుంది. వచ్చే ఎన్నికల నాటికి జిల్లాలోని మాదిగలను సంఘటితం చేసేందుకు త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని సమావేశం తీర్మానం చేసింది.



జిల్లా మాదిగల రాజకీయ జేఏసీ నూతన కార్యవర్గ ప్రతినిధులు